కేటాయింపులు సరే.. అభివృద్ధి ఏదీ..?

మౌలిక వసతులకు నోచుకోని మురికి వాడలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగర పాలక సంస్థ ఏటా ప్రకటిస్తున్న కోట్ల రూపాయల బడ్జెట్‌లో నగర అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తోంది. రూ.2,70,000వేలకు పైగా ఉన్న చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. ప్రభుత్వం నోటిఫైడ్ చేసిన మురికివాడలు 60 వరకు ఉన్నాయి. మురికివాడలను అభివృద్ధి చేసేలా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. అయితే మురికివాడల్లో కనీస మౌలిక వసతులు చూస్తే ఈ నిధులన్నీ ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే సందేహాన్ని సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోతోంది.

గతేడాది అంటే 2023-24 నగర పాలక బడ్జెట్‌లో మురికివాడల అభివృద్ధి కోసం 24 కోట్ల 60లక్షలకు కేటాయించారు. రంగాల వారీగా చూస్తే షెడ్యూల్డ్ కులాల వారికి బడ్జెట్‌లో 15 శాతం రూ.3 కోట్ల 69లక్షలు, షెడ్యూల్ తెగలవారికి 7.5 శాతం కోటి 85 లక్షల 50 వేలు, స్త్రీ శిశు సంక్షేమం 5 శాతం కోటి 23 లక్షలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 3శాతం 73 లక్షల 80వేలు, గుర్తింపు పొందిన మురికివాడల అభివృద్ధి కోసం 40 శాతం 9 కోట్ల 84 లక్షలు. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితయ్యాయని చెప్పడానికి చిత్తూరు నగరంలోని మురికివాడల్లో మౌలిక వసతులు పరిశీలిస్తే స్పష్టంగా ఇట్టే తెలిసిపోతుంది. నగర పాలక సంస్థ ఏటా బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధులు ఆయా రంగాల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తే చిత్తూరు నగరంలోని మురికివాడలు ఇంతటి దయనీయ పరిస్థితిలో కనిస మౌలికవసతులు లేక అల్లాడాల్సిన పరిస్థితి ఉండేదికాదని మురికివాడల్లో నివశిస్తున్న పేదలు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 శాతం డ్రైనేజీలు లేవు

ఈ ఏడాది బడ్జెట్ సమావేశంలోనే చిత్తూరు నగరంలో 50శాతం డ్రైనేజీలు లేని కార్పొరేట్లు గగ్గోలు పెట్టారు. అలాగే నగరం అభివృద్ధి చెందుతున్నా సీసీ రోడ్లు నిర్మాణం లేక మట్టి రోడ్లపై ప్రయాణాలు చేయాల్సి వస్తోందని, వర్షాల సమయంలో వృద్ధులు, పిల్లలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ముకివాడల్లో ఖచ్చా రోడ్లు, అస్థవ్యస్థమైన డ్రైనేజి వ్యవస్థ, గుడ్డి దీపాలుగా ఎల్ఈడి లైట్లు ఇవన్ని సాక్షాత్తు గత నగర పాలక బడ్జెట్ సమావేశంలో కార్పొరేట్లు లేవనెత్తిన సమస్యలే...

రామ్‌నగర్ కాలనీ....

నగర విస్తరణలో మధ్యతరగతి ఎక్కువగా ఉన్న రామ్‌నగర్ కాలనీ విస్తరించింది. దాదాపు నీవానది వరకు నివాసాలు ఏర్పడాయి. విస్తరణలో వీధిలైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇక్కడి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ లేక మురుగునీరు సమీపాల్లోని ఖాళీ ఇంటి జాగాల్లో వదిలేస్తున్నారు. దీంతో దోమలు వృద్ధి చెందిన రోగాలు వ్యాపిస్తున్నాయి. గృహనిర్మాణం అప్రూవ్, ఇంటి పన్ను, నీటి పన్నులు చెల్లిస్తున్నా నగరపాలక సంస్థ సీసీరోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజి కాలువలు ఏర్పాటు చేయకపోడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

డ్రైనేజీ కాలువలు లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

స్కావెంజర్స్ కాలనీ..

ఇక్కడ పారిశుధ్య కార్మికులు అత్యధికంగా ఉండటంతో స్కావెంజర్స్ కాలనీ పేరు పెట్టుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురుగునీటి కాలువల్లో మురుగు నీరు పారదు. వీధి లైట్లు అంతమాత్రమే. పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాంచాలని దీర్ఘకాలికంగా ఈ కాలనీ వాసులు కోరుతున్నారు.

ఇరుకైన ఆవాసల మధ్య నిలిచిపోయిన మురుగునీరు, మినుగురు పురుగులా లైటింగ్ ఎల్ఈడి బల్బులు

డ్రైనేజీలో నిలిచిన మురుగునీరు

బివిరెడ్డి కాలనీ..

వ్యాపారులు, ధనికులు నివాసమున్న బివిరెడ్డి కాలనీలో సైతం సీసీ రోడ్లు లేకపోవడంతో ఇక్కడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించుకొని వేలకువేలు పన్నులు కడుతున్నా సిసి రోడ్లు వేయడం లేదని ఇక్కడి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఈడి పేరిట నగర పాలక సంస్థ విద్యుత్ ఆదా పేరిట వందశాతం ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేసి చీకట పడ్డాకా.. ఇక్కడ వీధి లైట్ ఉంది అని గుర్తించేందుకు తప్పా ఏమాత్రం వెలుతురు లేకపోవడంతో మహిళలు రాత్రి సమయాల్లో వీధుల్లో తిరిగేందుకు భయపడాల్సి వస్తోందటున్నారు.

ఓటి చెరువు..

జిల్లా కలెక్టర్‌రేట్‌కు అతిసమీపంలో ఉన్న దళిత కాలనీ ఓటిచెరువు. ఇక్కడ 50 దళిత కుటుంబాలున్నాయి. ఇరుకైన డ్రైనేజీ, మురుగు నీరు పారే అవకాశం లేకుండా చుట్టు ఉన్న అగ్రవర్ణలు వారు గోడ కట్టేయడంతో ఆవాసాల మధ్య మురునీరు నిలిచిపోతోంది. దీంతో ఇండ్ల మధ్య నిలిచిపోయే మురుగునీరు ఎత్తిపోయాల్సి వస్తోందంటున్నారు. డ్రైనేజీని వెడల్పు చేసి మురుగునీరు పారేలా ఏర్పాటు చేయాలని ఇక్కడి దళితులు కోరుతున్నారు. ఇలా పై ప్రాంతాలతో పాటు చిత్తూరు నగరంలోని పెద్ద హరిజనవాడ, రాజీవ్ నగర్, వీరభద్ర కాలనీ, కైలాస పురం, జానకారపల్లి, ఇరువారం, అంబేద్కర్ నగర్, పాంచాలిపురం దాదాపు నగర పరిధిలోని మురికివాడలు కనీస మౌలిక వసతులు లేక ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నగర పాలక సంస్థ ఇప్పటికైనా బడ్జెట్‌లో తమ వాడ అభివృద్ధి కోసం కేటాయించే నిధులు మురికివాడల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు చేయాలని కోరుతున్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

పూలే చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో పూలే చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాష, సిపిఓ సాంబశివా రెడ్డి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పిసిఆర్ సర్కిల్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి నాయకులు కె.మణి, బి.కుమారి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, నగర కార్యదర్శి విసి.గోపీనాథ్, మాజీ సైనిక ఉద్యోగి ఎస్.వెంకట రమణ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల కేంద్రం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మహాత్మ జ్యోతిరావు పూలే 134 వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, అంటరానితనం కులవ్యవస్థ నిర్మూలన కొరకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల..

పలమనేరు: గురువారం టవర్ క్లాక్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి వేడుకలు బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, టిడిపి బలరాం, రమణమూర్తి, గోవిందస్వామి, త్యాగరాజులు, వెంకటరమణ, నంజుండప్ప పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : కుప్పం పురపాలక సంఘ సామగుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా పాఠశాల సిబ్బంది పూలే చిత్ర పటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీనదయాళ్, తెలుగు ఉపాధ్యాయుడు గాలి సురేష్, సౌజన్య, గాయత్రీదేవి, శాంత, విజయనిర్మల, సరస్వతి పాల్గొన్నారు.



పలమనేరులో..

అంగన్వాడీలపై రాజకీయ

వేధింపులు మానుకోవాలి

- ఎమ్మెల్సీకి సిఐటియు లేఖ - కలెక్టర్, పీడీలకు వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శాంతిపురం ప్రాజెక్టులో మినీ అంగన్వాడీలను రాజకీయంగా వేధించడం సరైనది కాదని ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), చిత్తూరు జిల్లా కమిటీ ఎంఎల్‌సి కంచెర్ల శ్రీకాంత్‌కి లేఖ పంపడం జరిగింది. అలాగే కలెక్టర్‌కి, పిడికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లలిత, షకీలా, గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, శాంతిపురం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎర్రమ్మ, శోభారాణి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీలను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్న సందర్భంగా 42 రోజులు సమ్మెలో భాగంగా శాంతిపురం, కుప్పం అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో స్వయంగా చంద్రబాబు నాయుడు శిబిరం వద్దకు వచ్చి అంగన్వాడీల పోరాటానికి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో జరుగుతున్న అరాచకాలు ఖండించిన టిడిపి నాయకులు ప్రస్తుతం శాంతిపురం ప్రాజెక్టులో మినీ అంగన్వాడీలను ఉద్దేశపూర్వకంగా ఒత్తిడి తెచ్చి విధుల నుంచి తప్పుకోవాలని భయపెట్టడం ఏమిటి అని ప్రశ్నించారు. అప్పటి నాయకులకు, ఇప్పటి నాయకులకి తేడా లేదనే పద్ధతిలో వ్యవహరిస్తున్నారు. పై స్థాయిలో అంగన్వాడీల సమస్యలపై సానుకూలంగా ఉన్నప్పటికీ క్రిందిస్థాయిలో ఉన్న వారిని కట్టడి చేయాలని కోరారు. ఇప్పటికే శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి మినీ అంగన్వాడీ వర్కర్ జీఆర్ వసంతను ఇబ్బందులు పెట్టి ట్రాన్సర్ చేశారని, నిబంధనల ప్రకారం అలా చేయడానికి లేదని, అయినా ఒత్తిడికి తలొగ్గి అధికారులు ట్రాన్సర్ చేశారని తెలిపారు. ఇంకా కక్షపూరితంగా విధుల నుంచి తొలగించాలని ఒత్తిడి చేస్తున్న వారిపై ఎమ్మెల్సీ స్పందించి చర్యలు తీసుకోవడంతోపాటు అంగన్వాడీలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే కలెక్టర్, పిడి స్పందించి రాజకీయంగా వస్తున్న ఒత్తిడి తలొగ్గి వర్కర్లను తొలగించే ప్రయత్నం చేయకుండా న్యాయం చేయాలన్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా ఉద్యోగులు, కార్మికులు ఆ ప్రభుత్వాలు చెప్పిన పనులన్నీ చేస్తున్నప్పటికీ ఇలాంటి వేధింపులకు పాల్పడం సరైంది కాదన్నారు. శాంతపురం మండలంలో వెంటనే రాజకీయ వేధింపులు మానుకోకపోతే అంగన్వాడీలందరూ ఐక్యంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ కోళ్ల ఫారాలపై విచారణ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

గ్రామంలో విచారణ చేస్తున్న అధికారి మల్లికార్జున్ రెడ్డి

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పసుపుతూర్పు పంచాయతీ మార్చేపల్లి గ్రామంలో నివాస స్థలాల అతి సమీపంలో కోళ్ల ఫారాలు ఉన్నాయని ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. దీంతో గురువారం మార్చేపల్లిలో అనుమతులు లేని 30 కోళ్లఫారాలు గ్రామం చుట్టుపక్కల ఉన్నాయని, వీటివలన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అధికారులు గుర్తించారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి బృందంతో మార్చేపల్లిలో పర్యటించి గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాలు ఇళ్ల మధ్యలోనే ఉన్నాయని నిర్ధారించి పై అధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామంలోని కోళ్ల ఫారాలు (ఫైల్ ఫొటో)

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రభంజనం

చౌడేపల్లిలో ఖోఖో టీమ్

యాదమరిలో విద్యార్థులు

ప్రజాశక్తి- యాదమరి: జోనల్ స్థాయి నాలుగవ డివిజన్ స్థాయిలో ఎనిమిది జిల్లాలు పోటీపడగా పూతలపట్టు నియోజకవర్గంకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. యాదమరి మండలం కె.గొల్లపల్లె హైస్కూల్ నుంచి ధనుష్ దేశభక్తి గేయాలాపనలో మొదటిస్థానం, వరిగపల్లె హైస్కూల్ విద్యార్థి నారాయణ క్విజ్ పోటీల్లో ద్వితీయస్థానం, వ్యాస రచన పోటీల్లో బంగారుపాళ్యం మండలం మంగళపల్లె హేమశ్రీకి మొదటిస్థానం, వకృత్వ పోటీలో మంగళపల్లె విద్యార్థి హేమకు ద్వితీయస్థానం, ఐరాల మండలం పైపల్లె హైస్కూల్ విద్యార్థి రోహిత్‌కి వకృత్వ పోటీలో మొదటి స్థానం సాధించారని ఉపాధ్యాయులు షహానాజ్ బేగం, అరుణ శివప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఆర్‌జెడి కడప విద్యాశాఖ అధికారి శ్యామూల్ అభినందించి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, భాస్కర్ రెడ్డి, హిమబిందు, స్వర్ణలత, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, గుణశేఖర్, శివప్రసాద్, సురేష్ రెడ్డి, విశ్వనాథ్, మోహన్ కుమార్, కాంచన అభినందించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు లక్ష్మీ

వి కోట: మండల పరిదిలోని పాముగానిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.లక్ష్మీ జాతీయస్థాయి అండర్ 14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ రెడ్డి తెలిపారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా కారంపూడిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా ప్రథమస్థానం సొంత చేసుకుంది. ఆ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి.లక్ష్మీని జాతీయస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈ విద్యార్థి త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థికి తర్ఫీదు ఇచ్చిన పిడి సురేష్ బాబును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వి కోటలో లక్ష్మీ..

ఖోఖోలో పుదిపట్ల విద్యార్థుల హవా..

చౌడేపల్లి: మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గురువారం జరిగిన జిల్లా స్థాయి ఖోఖో క్రీడల్లో పుదిపట్ల విద్యార్థులు విజయం సాధించారు. సీనియర్ బాలుర విభాగంలో పుదిపట్ల మొదటి స్థానం, చౌడేపల్లి రెండవ స్థానంలో నిలిచారు. సీనియర్ బాలికల విభాగంలో పుదిపట్ల మొదటి స్థానం సాధించగా, రొంపిచెర్ల రెండో స్థానాన్ని సాధించారు. అదేవిధంగా జూనియర్ బాలుర విభాగంలో విజయవాణి ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం, విజయవాడ ఐసిఎస్సి ద్వితీయ స్థానం, జూనియర్ బాలికల విభాగంలో ఒకటవ స్థానంలో పుదిపట్ల, రెండవ స్థానంలో మేలుపట్ల విద్యార్థులు నిలిచారు. ఖోఖో క్రీడల్లో జిల్లాస్థాయి నుంచి 25 టీములు పాల్గొన్నారు. ఎంఈఓ కేశవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పీఈటీ రామచంద్రయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ మనోహర్ రెడ్డి, గ్రామస్తులు వినోద్ కుమార్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీకి వెంకట్ ఎంపిక

విజయపురం: మండలం, ఇల్లత్తూరు గ్రామానికి చెందిన వెంకట్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీకి ఎంపిక చేసినట్లు తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 18వ తేదీ కేరళలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వెంటక్ పాల్గొంటరాని ఆ ప్రకటనలో తెలిపారు. వెంకట్ ఎంపిక పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విజయపురంలో వెంకట్

పకడ్బందీగా పిసిపిఎన్‌డిటి చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గర్భస్థ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో పిసిపిఎన్‌డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రా ప్రియేట్ అథారిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని స్కానింగ్ సెంటర్ల వారు గర్భిణీ స్త్రీకి లింగ నిర్ధారణ చేసి అబార్షన్‌కు కారకులవుతున్నారని, దీనిని రూపు మాపేందుకు డెకాయ్ ఆపరేషన్లు తప్పక చేపట్టాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు డెకాయ్ ఆపరేషన్ల ద్వారా లింగ నిర్ధారణ చేసినట్లు స్కానింగ్ సెంటర్ల వారిని పట్టిస్తే లక్ష రూపాయలు బహుమానం ఇస్తానని, అలా జిల్లాలో ఐదు మందికి ఐదు లక్షలు ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఆశా కార్యకర్తలు వినియోగించుకోవాలని తెలిపారు. లింగ నిర్ధారణ అనేది చట్టరీత్యా నేరం ప్రభుత్వ ఆదేశాల నిబంధనలకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్ మృతుల కుటుంబాలను ఆదుకుంటామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన చలపతి సతీమణి రమాదేవికి గురువారం విడో ఫండ్ నుండి రూ.50,000వేలు, ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.25,000లు జిల్లా ఎస్పీ అందించారు. అలాగే ఐరాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కె.వెంకటరమణ సతీమణి రాణికి విడో ఫండ్ నుండి రూ.50,000, ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.25,000లు చెక్కులను జిల్లా ఎస్పీ చిత్తూరు పోలీస్ ఆఫీస్ ఏఓ నాగభూషనమ్మ, క్లర్క్ పార్థసారధి నాయుడు సమక్షంలో చిత్తూరు పోలీసు కార్యాలయంలో అందజేశారు.

హెచ్ఐవి లేని సమాజ స్థాపనే లక్ష్యం

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజలు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంను పురస్కరించుకొని అందుకు సంబంధించిన గోడపత్రికలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్ఐవి అనేది హ్యూమన్ ఇమ్యూనో డిఫికెన్సీ వైరస్ ద్వారా వస్తుందని, వాడిన సిరంజిలు తిరిగి వాడటం, హెచ్ఐవి పాజిటివ్ ఉన్నవారి బ్లడ్ ఇతరులకు ఎక్కించినప్పుడు, పాజిటివ్ ఉన్న తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులతో తిరిగిన, కలిసి భోజనం చేయడం, వారి పనిముట్లు తాకడం వలన హెచ్ఐవి రాదని తెలిపారు. 2030 నాటికి హెచ్ఐవి లేని సమాజ స్థాపనే మన అందరి లక్ష్యమని, ఆ విధంగా ప్రజలందరికీ అవగాహన కల్పించి సమాజ ఆరోగ్యానికి తోడ్పడాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్, వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ హనుమంతరావు, ఆర్‌బిఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అవగాహన స్టాల్‌ను ప్రారంభించిన డిఎంఅండ్‌హెచ్ఓ

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి గురువారం గాంధీ విగ్రహం ఎదుట హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన స్టాల్ ప్రారంభించారు. నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కళాజాత కార్యక్రమాలు, పాటల కార్యక్రమాలతో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

లారీ డ్రైవర్లకు అవగాహన

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి అపోలో కాలేజ్ బృందం గురువారం చిత్తూరు నగర పరిధిలోని మురుకంబట్టు బైపాస్ రోడ్డు, సరాయి ఫ్యాక్టరీ ఆపోజిట్ లారీ అసోసియేషన్‌లో డ్రైవర్లకు, యువతకు హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు.

ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీగా రాంబాబు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీగా రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన డీఎస్పీల సాధారణ బదిలీలో భాగంగా చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు డీఎస్పీగా రాంబాబు బదిలీ పై వచ్చి గురువారం తన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

9న పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వచ్చే నెల 9వ తేదీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు మురుగానందం, నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించడంతో పాటు జిల్లాలో ఖాళీ అయిన స్థానాల ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి సభ్యులు పాల్గొనాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులో వెబ్ టెక్నాలజీస్ గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుతం కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమని తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగావకాశాలు, ఉద్యోగ కల్పనలో కంప్యూటర్ కోర్సుల పరిజ్ఞానం తప్పనిసరి అని తెలిపారు. వాయల్పాడు ఎన్‌టిఆర్ ప్రభుతవ్వ డిగ్రీ కాలేజీకి చెందిన కంప్యూటర్ లెక్చరర్ టి.సుబ్రమణ్యం వెబ్ టెక్నాలజీపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో వాడే వెబ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అధ్యాపకులు గెస్ట్ లెక్చరర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కంప్యూటర్ కోర్స్ అధ్యాపకులు ఎస్‌కె. మున్వర్, వై.శ్రీనివాసులు, ఐక్యు ఎసి కోర్డినేటర్ డాక్టర్ పూడి వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భరణీ నాథ్ రెడ్డి, ఎం.ఇస్మాయిల్, టి.నరేంద్ర బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

హౌసింగ్ పీడీ పద్మనాభం

పెండింగ్ ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ పద్మనాభం ఆదేశించారు. గురువారం మండలంలోని కోటాగరం పంచాయతీ ఒడ్డుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను హౌసింగ్ పీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లను ఇదివరకే 100 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ అవకాశం లబ్ధిదారులు డిసెంబర్ లోపు పెండిగ్ ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని కోరారు. హౌసింగ్ శ్రీధర్, వర్క్ ఇన్స్పెక్టర్లు గీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కంటే రక్తదానం మిన్న

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌సిసి సంయుక్తంగా స్విమ్స బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులురెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఒకరికి జీవితాన్ని కాపాడిన వారు అవుతారని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్, గణిత శాస్త్ర అధ్యాపకుడైన డాక్టర్ ధనంజయ రెడ్డి తన జీవితకాలంలో రక్తదాతగా 25వ సారి రక్తదానం చేసి విద్యార్థులందరికీ స్ఫూర్తి ప్రదాత అయ్యారని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 21 మంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సురేష్, డాక్టర్ సిఎన్.లత, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రఘు, డాక్టర్ బాబు, కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని 25వ వార్డు బౌండరీ వీధిలోని సి.రామయ్య అనే టిడిపి కార్యకర్త మరణించారు. ఇతను గతంలో టిడిపి సభ్యతం తీసుకుని ఉన్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు కాజురు బాలాజీ, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, రమేష్, కుసుమ, సుమిత్ర, దేవి, నాగవేణిలు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదేశాల మేకు తక్షణ సాయంగా రూ.10వేలు మృతుని కుటుంబానికి అందజేశారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి నివాళి

కార్మికుడి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనర్, మేయర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడు వినోద్ మృతిచెందడంతో నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం హైరోడ్డు మున్సిపల్ లైన్‌లోని మృతుని గృహానికి వెళ్లి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ నుంచి ఆర్థిక సాయంగా రూ.15వేలు అందించారు. ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం, నగరపాలక ఉద్యోగులు నివాళులు అర్పించారు.

ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- సోమల
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సచివాలయాల సిబ్బంది చేస్తున్న జియో ట్యాగ్ సర్వేని వేగవంతంగా చేయాలని ఇదే క్రమంలో పారదర్శకంగా ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన సర్వేని చేయాలని ఎంపీడీవో నారాయణ సిబ్బందిని కోరారు. గురువారం మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామపంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీ కేంద్రం అయినందున పన్నుల వసూలు వేగవంతం చేసి అభివృద్ధికి సహకరించే విధంగా ప్రజలను మోటివేట్ చేయాలని కార్యదర్శి జయశంకర్ ను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాష మసూద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలిద్దాం...

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించి రాబోయే కాలం కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్లేపల్లి సిద్ధయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నేడు అధికంగా ఉంటోందని, దీని వలన భూమి కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ మట్టిలో కలవడానికి వందల సంవత్సరాలు పడుతుందని అటువంటి ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని కోరారు.

బోయకొండ గంగమ్మ

హుండీ ఆదాయం రూ.69 లక్షలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.69,17,185లు ఆదాయంగా సమకూరినట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. బుధవారం బోయకొండపై 57 రోజులకు గాను నిర్వహించిన హుండీ లెక్కింపు ద్వారా నగదుతో పాటు 38 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీని భక్తులు కానుకలుగా సమర్పించారని తెలిపారు. వీటితోపాటు రణభేరి గంగమ్మ హుండీ ద్వారా రూ.45,844లు ఆదాయంగా సమకూరినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో మదనపల్లి ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శశి కుమార్, ఆలయ అధికార అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

నారావారిపల్లిలో 'ప్రజాప్రతినిధుల' సందడి

తమ్ముని కర్మక్రియల్లో చంద్రబాబు

శ్రీ శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు కర్మక్రియలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతూరు నారావారిపల్లిలో దగ్గరుండి గురువారం నిర్వహించారు. కుమారుడు, మంత్రి నారా లోకేష్, ఎంఎల్ఎలు, ఎంపిలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు స్వగృహంలో రామ్మూర్తినాయుడుకు నివాళి అర్పించారు. అనంతరం రామ్మూర్తి తనయుడు నారా రోహిత్ మంగళవాయిద్యాలతో పూజాసామాగ్రి తట్టతో సమాధి వద్దకు దాయాదులతో కలిసి వెళ్లి పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ శేషాచల లింగేశ్వర స్వామిని నారా చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి సిఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, వి.అనిత, సవిత, బిసి జనార్ధన్, మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, మాజీ మంత్రి దేవినేని ఉమ, బుద్దా వెంకన్న, ఎంఎల్ఎలు ఎన్.అమరనాథ్‌రెడ్డి, బొజ్జల సుధీర్, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ థామస్, ఆదిమూలం, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గురజాల జగన్మోహన్‌నాయుడు, గాలి భానుప్రకాష్, వైసిపి ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి, టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నారావారిపల్లిలో అనంతపురం రేంజి డిఐజి షిమూషి బాజ్‌పేయ్ ఆధ్వర్యంలో ఎస్‌పి సుబ్బరాయుడు నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. ఎ.రంగంపేట-నారావారిపల్లి చెక్‌పోస్టు వద్ద విఐపిల వాహనాలను మాత్రమే అనుమతించారు. మూడు చోట్ల శాఖాహారంతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సిఎం చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని స్వగృహానికి తిరుగు ప్రయాణం అవుతారు.

దళిత మహిళపై యువకుని దాడి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) : చంద్రగిరిలోని పాతపేట దిగువ వీధికి చెందిన గురుకుమార్ తనపై దాడిచేశాడని గురువారం బాధితురాలు కాకర్ల శ్యామల అనే దళితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో తన కుమార్తెను గురుకుమార్ వేధించాడని, అప్పటి నుంచి తన కుటుంబంపై కక్ష పెంచుకున్నాడని పేర్కొన్నారు. గురువారం తాను పొలం పనులు చేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో అడ్డగించి రాయితో కొట్టాడని, ఇంటి దగ్గర తన కుమార్తెపై దాడికి పాల్పడ్డాడని పేర్కొంది. తనను, తన కుమార్తెను అంతమొందిస్తానని హెచ్చరిస్తున్న గురుకుమార్‌ను అరెస్టు చేసి, తమకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

యాదమరిలో..

ప్రజాశక్తి - యాదమరి: మంచి విద్యను అభ్యసించాలంటే ఆరోగ్యవంతంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారిని రుక్మిణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే మంచి విద్యాను అభ్యసించి ఉన్నత శిఖరాలకు అధిరోహించగలరి తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించందని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, సూపర్వైజర్ సెల్వరాని లక్ష్మీపతి, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని జెఎల్ఎస్ ఫామ్ ఉన్నత పాఠశాలలో గురువారం పత్తికొండ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో 125 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. స్కూల్‌లోని విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష, బరువు, ఎత్తు, ఈఎన్‌టి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అవసరమైన విద్యార్థులు ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థులు శుభ్రత పాటించి నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, జంక్‌ఫుడ్స్ జోలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకొని సకాలంలో ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది కాంతమ్మ గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, జాగ్రత్తలను వివరించారు.

గంగవరంలో..

వ్యవసాయ అధికారి కార్యాలయంకు తాళం

కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

ప్రజాశక్తి -సదుం: సదుం వ్యవసాయ అధికారి కార్యాలయం పనివేళ్లలోనూ తాళం చేసే కనబడుతోంది.. గురువారం తమ పనులపై వచ్చిన రైతులు తాళం వేసి ఉండటంతో వెనుదిరిగారు. గత కొంత కాలంగా వ్యవసాయాధికారి ఆఫీసుకు రావడం లేదని నిత్యం తాళం వేసి ఉంటోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పక్కనే ఉన్న మండల విద్యాశాఖాధికారి కార్యాలయం పనివేళ్లలో ఎప్పుడూ తెరచి ఉంటుందని ఎంఈవో అందుబాటులో ఉంటున్నారని చెబుతున్నారు. అయితే వ్యవసాయ అధికారి కార్యాలయం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ కాయలు విత్తన పంపిణీ సమయంలో మాత్రమే కార్యాలయం తెరిచి ఉంచుతారని, వేరుశనగ విత్తనాలకు రసీదులు ఇచ్చే సమయంలో వ్యవసాయ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు హడావిడిగా కనబడుతారని ఆ తరువాత మండలవ్యవసాయ అధికారి కార్యాలయానికి తాళం వేసి ఉంటోందని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామాలలో రైతు సేవా కేంద్రాలు ఏర్పడిన తరువాత మండల వ్యవసాయ అధికారి ఈ కార్యాలయాన్ని తీయడమే మానేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కార్యాలయం చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, మేకల వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని, మెట్ల కింద సైతం మద్యం బాటిళ్ళు, ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్లు దర్శనమిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పనివేళల్లో రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు, రాత్రివేళ్లలో అసాంఘిక కార్యకపాలాలు జరుగుకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు: డీఎస్పీ

ప్రజాశక్తి- పలమనేరు: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులను పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పలమనేరు సబ్ డివిజన్ డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే విద్యార్థులు, రికార్డులు, లైసెన్స్‌తోపాటు హెల్మెంట్ ధరించాలని సూచించారు. అలాగే గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థులను సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, బాగా చదివి తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు తేవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, గంగవరం సిఐ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

దొంగతనాలకు చెక్ పెట్టేందుకే స్మార్ట్ లాక్స్

ప్రజాశక్తి- సోమల: దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, షాపింగ్ కాంప్లెక్స్ ఇండ్లలో దొంగతనాలు జరగకుండా నివారించేందుకు స్మార్ట్‌లాక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని సోమల ఎస్సై శివ శంకర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుంగనూరు రూరల్ సిఐ ఆధ్వర్యంలో ఇప్పటికే పోలీస్ స్టేషన్‌కు స్మార్ట్ లాక్‌లను తెప్పించడం జరిగిందని వీటిని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇవ్వనున్నామని తెలిపారు. ఎవరైనా చోరీకి పాల్పడేందుకు వచ్చి లాక్‌ను తాకిన వెంటనే అందులోని అలారం సిస్టం నిరంతరం మ్రోగుతూ ఉంటుందని తద్వారా తమకు అంది సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని వీటికి తోడు స్మార్ట్ సెక్యూరిటీ లాక్‌లను కూడా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

స్మార్ట్ లాక్‌తో నేరాలు అదుపు : ఎస్సై నాగేశ్వరరావు

చౌడేపల్లి: స్మార్ట్ లాక్‌తో నేరాలను అదుపు చేయవచ్చు అని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక హనుమాన్ సేట్ జ్యూవెలరీస్ వద్ద దుకాణదారులు, స్థానికులకు స్మార్ట్ లాక్స్‌పై అవగాహన కల్పించారు. షాపులకు, ఇళ్లకు ఈ లాక్స్ అమర్చ వలన గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి పగులగొట్టే ప్రయత్నం చేస్తే అలారం మెగుతుందని, దీంతో చుట్టుపక్కల వారు వెంటనే అప్రమత్తమై తమకు సమాచారం అందించాలన్నారు. స్మార్ట్‌లాక్స్ కావల్సినవారు స్థానిక పోలీస్‌స్టేషన్లో సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్య అర్చన జరిపారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్థంభ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గజపటాన్ని ఆరోహణం చేశారు. టీటీడీ ఈవో జె. శ్యామల రావు దంపతులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, పాంచరాత్ర ఆగమ సలహాదారు మణికంఠ స్వామి, కంకణ భట్టార్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు. అనంతరం ఈవో జె.శ్యామలరావు శుక్రవారపు తోటలో ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్ప కళాశాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, ఆయుర్వేద ప్రదర్శనను ప్రారంభించారు. మాడావీధుల్లో ఉండే ప్రతి భక్తునికి వాహన సేవ దర్శనం కల్పిస్తామని ఈవో తెలిపారు. చెన్నైకు చెందిన హిందూ మహాసభ ట్రస్ట్ చైర్మన్ డిఎల్ వసంత కుమార్ అమ్మవారికి కానుకగా ఆరు గొడుగులను ఈవోకు అందజేశారు. గురువారం రాత్రి అమ్మవారు మురళికృష్ణుని అలంకారంలో పిల్లనగ్రోవి ధరించి చిన్న శేష వాహనంపై దర్శనమిచ్చారు.

ఆకట్టుకుంటున్న పుష్ప ప్రదర్శనశాల

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని శుక్రవారపుతోటలో ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనశాల భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. టీటీడీ ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో ' హిరణ్యక్షుడనే రాక్షసుడిని సంహరించి భూదేవిని కాపాడుతున్న వరాహరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు, వాలి సుగ్రీవుల మధ్య జరిగే యుద్ధంలో చెట్టు చాటు నుండి వాలిని సంహరిస్తున్న రాముడు, శ్రీ రామ రావణ యుద్ధంలో వనరులతో యుద్ధం చేస్తున్న కుంభకర్ణుడు అనే రాక్షసుడి ప్రతిమలు ఏర్పాటు చేశారు. వివిధ పుష్పాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల ఆకతులు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. మైసూర్ కు చెందిన గౌరి గత 9 సంవత్సరాలుగా సైకిత శిల్పాన్ని తయారు చేస్తోంది, ఈ ఏడాది అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి సైకిత శిల్పాన్ని రూపొందించారు.

మంత్రి పట్టువస్త్రాల సమర్పణ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి టిటిడి ఈవో శ్యామల రావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్వో శ్రీధర్, ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నట్టు చెప్పారు.

బైక్ అదుపుతప్పి

బావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- ఐరాల:

బైక్ అదుపు తప్పి బావిలో పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు ప్రాణాలతో బయటపడిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు తెలిపారు. సిఐ తెలిపిన సమాచారం మేరకు చిత్తూరు నగరంలోని గిరింపేట భరత్‌నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్, యాదమరి మండలం కమ్మరాయని మిట్టకు చెందిన రితీష్ అనే ఇద్దరు యువకులు బీటెక్ చదువుతున్నారు. ఇద్దరు పరీక్ష రాయడానికి కల్లూరు పరిధిలోని ఎం.జి.ఆర్. కళాశాలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం ఐరాల మండలం మద్దిపట్లపల్లి వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న 50 అడుగుల బావిలో ఇద్దరూ పడిపోయారు. ఇందులో ఉదయ్ కుమార్ చాకచక్యంగా బావిలో నుండి పైకి రాగా, రితీష్ ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. సుమారు ఐదు గంటల పాటు నాలుగు మోటర్ల ద్వారా నీరును బయటకు వదిలి రితీష్ మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని తరలించినట్లు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి ఆరునెలలు జైలు శిక్ష

ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

మోటార్ సైకిల్ చోరీ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష పడినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. నాలుగు నెలల ముందు తగ్గువారిపల్లిలో ఓ మోటర్ సైకిల్‌ను దొంగతనం చేసిన కేసు నమోదు కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బండ్లదొడ్డి గ్రామానికి చెందిన తుమ్మల ఈశ్వర్ చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం చిత్తూరు కోర్డులో హాజరు పరచగా జడ్జి ఉమాదేవి కేసు పూర్వాపరాలను పరిశీలించి ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కోర్టులోనిందితుడితోపాటు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టిన హెడ్ కానిస్టేబుల్ సామ్రాజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు అభినందించారు

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి-గంగవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు. బెంగళూరు – చెన్నై జాతీయ రహదారి గంగవరం పరిధిలోని వైయస్సార్ విగ్రహం వద్ద గత మూడు నెలల్లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని బుధవారం జాతీయ రహదారి అధికారులతో చర్చించినట్లు వివరించారు. ముఖ్యంగా రహదారిపై స్పీడ్ బ్రేకర్లు గుర్తించుకపోవడం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పీడ్ బ్రేకర్లకు వైట్ పెయింట్ వేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగే ప్రతిఒక్క చోట తప్పనిసరిగా వైట్ పెయింట్‌తో పాటు సూచిక బోర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని అన్నారు. వాహనదారులు సైతం అతివేగంగా రాకుండా వేగం తగ్గించి వెనుక ముందు చూసి డ్రైవింగ్ చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు అతివేగం, ఓవర్‌టేక్ చేయడం వల్లనే ఈ ప్రాంతంలో ఎక్కువ ప్రమాదం జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు సైతం రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం ఎక్సైజ్ పరిధిలో కర్ణాటక మద్యం అక్రమ వ్యాపారులపై ఎక్సైజ్ సీఐ నాగరాజా ఉక్కు పాదం మోపారు. ఎక్సైజ్ సిఐ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీలకు అనుగుణంగా ఎక్సైజ్ పరిధిలో మద్యం వ్యాపారం జరగాలని, కొంతమంది అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. అటువంటి వారిని ఉపేక్షించేది లేదని చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుప్పం ఎక్సైజ్ సీఐగా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కేవలం రెండు నెలల్లో సుమారు 41 కేసులను నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నమోదైన కేసులలో ఎక్కువ భాగం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వారే ఉండడం గమనార్హం అన్నారు. ఇటువంటి వారిని వదిలిపెట్టేది లేదని, ప్రజలు సైతం తమకు సహకరిస్తూ అక్రమ మద్యం వ్యాపారులపై తమకు సమాచారం అందించాలని కోరారు.

పెద్ద ఉప్పరపల్లెలో చోరీ

ప్రజాశక్తి సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి గ్రామంలోని పీర్ల చావిడి సమీపంలోని ఓ ముస్లిం ఇంటిలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగినట్లు సమాచారం. ఇంటిలోని వారు గ్రామానికి చెందిన బంధువుల వివాహ వేడుకలకు 11 గంటల ప్రాంతంలో వెళ్లి తిరిగి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించినారని రూ.34 వేలు నగదు, 140 గ్రాముల బంగారు, వెండి చోరీకి గురైనట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులతో మాట్లాడినట్టు సమాచారం.

నారా రామ్మూర్తికి ఘననివాళి

ప్రజాశక్తి,- కుప్పం టౌన్: దివంగత టిడిపి నేత చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకి కుప్పం టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. గురువారం నారావారిపల్లిలో రామ్మూర్తి నాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి కుప్పం నుండి పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ ఉమాపతి హాజరయ్యారు.

రుయా పారిశుధ్య కార్మికుల అధ్యక్షులుగా ఎం.నిర్మల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రుయా హాస్పిటల్‌లో ఏ వన్ సర్వీస్ లో పనిచేసే పారిశుధ్య కార్మికులు సిఐటియు అనుబంధంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.నిర్మల, ప్రధాన కార్యదర్శిగా పి. ఉషారాణి, కోశాధికారిగా పి.నీలవేణి ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, తక్షణమే తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, పి బుజ్జి, ఏ1 సర్వీస్ కార్మికులు ఉపాధ్యక్షులు వై పార్వతి, జమునమ్మ, జాయింట్ సెక్రటరీ వై లక్ష్మమ్మ, ఆర్ అమ్ములు, కమిటీ సభ్యులు మునిరాజా, సుజాత పాల్గొన్నారు.